
మరువ పారుతున్న గొట్లూరు చెరువు

గొట్లూరు చెరువు ఫుల్..

ధర్మవరం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు చెరువు పూర్తిగా నిండిపోయి, మరువ ఉధృతంగా పారుతోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు ఎగువ ప్రాంతం నుచి వర్షపునీరు భారీగా వచ్చిచేరింది. దీంతో చెరువు నిండి, మరువ ఉధృతంగా పారుతోంది. మరువ వద్ద సందర్శకుల తాకిడి పెరిగింది. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోరు బావుల్లో భూగర్భ జలాలు పెంపొందుతాయనీ, పంటలు పండించుకోవచ్చని సంబరపడుతున్నారు. ఆయకట్టు కూడా సాగులోకి రానుంది.


నిండిన చెరువు


తొణికిసలాడుతున్న సీజీపీ


ప్రాజెక్టు గేటు నుంచి నదిలోకి వెళుతున్న నీరు

నిండుకుండ..

- పూర్తిగా నిండిన సీజీపీ
- ఒక గేటు ఎత్తి 800 క్యూసెక్కులు విడుదల

తనకల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లవారిపల్లి సమీపాన గల చెన్నరాయ స్వామి గుడి ప్రాజెక్టు (సీజీపీ) నిండుకుండలా మారింది. పూర్తిగా నిండిపోయింది. ఆదివారం సాయంత్రం అమడగూరు ప్రాంతంలో కురిసిన వర్షాలకు ఒక్కసారిగా ప్రాజెక్టులోకి అధికంగా నీరు చేరింది. సీజీ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 170 ఎంసీఎఫ్టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్) కాగా.. పూర్తిగా నిండిపోయింది. ఒక గేటు ఎత్తి 800 క్యూసెక్కుల నీటిని పాపాఘ్ని నదికి విడుదల చేస్తున్నారు. తొలుత మైనర్ ఇరిగేషన్ అధికారి బయప్ప ఆదివారం రాత్రి ఒక గేటును రెండున్నర అడుగులు ఎత్తి 650 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సోమవారం మధ్యాహ్నానికి వరద మరింత పెరగడంతో గేటును మరింత పైకి ఎత్తి నీటి విడుదలను 800 క్యూసెక్కులకు పెంచారు. వంకమానేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాత్రికి మరోమారు గేట్లు ఎత్తాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. సీజీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని కిందికి వదలడంతో పాపాఘ్ని నది పరవళ్లు తొక్కుతోంది. సీజీ ప్రాజెక్టు గేటు ఎత్తే ముందు అధికారులు.. గ్రామాల్లో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. గేటు నుంచి నీటిని విడుదల చేయడంతో ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి పెరిగింది.


పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ రత్న


కలెక్టర్ టీఎస్ చేతన్


నివాళులు అర్పిస్తున్న పోలీసు అమరవీరుల కుటుంబసభ్యులు

పోలీసుల త్యాగాలు మరువలేనివి


అమరవీరుల కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న

- అమరవీరుల ఆశయాల స్ఫూర్తితో విధులకు పునరంకితమవుదాం
- జిల్లా ఎస్పీ రత్న
- పోలీసు అమరవీరులకు ఘననివాళులు



పుట్టపర్తిరూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేశభద్రత, సమాజ రక్షణలో పోలీసుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, విధులకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్థూపం వద్ద సోమవారం ఘన నివాళి అర్పించారు. తొలుత సాయుధ పోలీసు బలగాల నుంచి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ, ఏడీజే శైలజ, జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ రత్న మాట్లాడుతూ... పోలీసులపై ప్రజలు పెట్టుకున్న విశ్వాసాన్ని వమ్ముచేయకుండా సమాజానికి సేవలందిద్దామన్నారు. విధుల్లో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన పోలీసుల త్యాగాలు వృథాకారాదన్నారు. వారిత్యాగాలను నిత్యం స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ.. దేశం, సమాజం కోసం పోలీసుల సేవలు మరువలేనివన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలొదిలిన ప్రతి అమర పోలీసుకు నివాళులు అర్పిస్తున్నామన్నారు.

చెక్కుల పంపిణీ: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు కలెక్టర్, ఎస్పీ.. పోలీసుశాఖ తరపున ఆర్థికసాయం చేశారు. అందుకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సొంత నిధుల నుంచి చంద్రశేఖర్, బాబావలి కుటుంబాలకు రూ.20 వేల చొప్పున ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, శివన్నారాయణస్వామి, వెంకటేశ్వర్లు, పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జలప్రదాత చంద్రబాబు

- ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి
- మారాల రిజర్వాయర్‌కు నీటి విడుదల


మారాల రిజ్వాయర్‌కు వెళ్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బుక్కపట్నం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతమైన రాయలసీమ జిల్లాలోని చెరువులకు నీరిచ్చిన జలప్రదాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మారాల రిజర్వాయర్‌కు హంద్రీనీవా కాలువ నుంచి కృష్ణా జలాలను సోమవారం విడుదల చేశారు. మారాల గ్రామ సమీపాన కాలువ గట్టును ఎక్స్‌కవేటర్ సాయంతో తవ్వి, నీటిని మళ్లించారు. అనంతరం ఎమ్మెల్యే గంగపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత టీడీపీ హయాంలో రిజర్వాయర్‌కు నీరు విడుదల చేసి, చంద్రబాబు జలహారతి ఇచ్చారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రిజర్వాయర్‌కు చుక్క కూడా నీరివ్వలేదన్నారు. నియోజకవర్గ రైతులను ఆ పార్టీ అధినేత జగన్, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మోసం చేశారన్నారు. నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ నింపుతామని 2019 ఎన్నికల సందర్భంగా ప్రగల్భాలు పలికిన శ్రీధర్ రెడ్డి అధికారం చేపట్టాక ఆ ఊసే మరిచారన్నారు. చెరువులకు చుక్కకూడా నీరిచ్చిన దాఖలాల్లేవన్నారు. కూటమి అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే నియోజకవర్గానికి నీరిచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. ఐదేళ్లలో నియోజకవర్గంలోని 193 చెరువులను నింపే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు గంగాధర్, వెంకటనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

త్వరలో మండలస్థాయి సమీక్షలు

- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై త్వరలో మండల స్థాయి సమీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. అందుకు అవసరమైన నివేదికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 148 అర్జీలు అందాయి. వాటిని కలెక్టర్ స్వీకరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయారనీ, రంగు మారిన కాయలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, భాస్కర్, రాధాకృష్ణ కోరారు. తనకున్న ఐదెకరాల భూమని కలెక్టర్ కార్యాలయ నిర్మాణానికి తీసుకున్నారనీ, దానికి బదులుగా రెండెకరాల భూమి ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని మాజీ సైనికోద్యోగి ఉప్పల్ ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర 2047 అమలుపై ప్రణాళికలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రజాఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్డీఓ సువర్ణ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికకు నోటిఫికేషన్

పుట్టపర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. జిల్లాలో 230 సాగునీటి సంఘాలున్నాయన్నారు. వీటిలో మైనర్ ఇరిగేషన్ 214, మీడియం ఇరిగేషన్ సంఘాలు 16 ఉన్నాయన్నారు. నవంబరు 21 నుంచి 23వ తేదీ వరకు సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపడతామన్నారు.


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న నందమూరి వసుంధరాదేవి

మా పిల్లలకు వాలీబాల్ అంటే మక్కువ

- నందమూరి వసుంధరాదేవి

తమ ముగ్గురు పిల్లల(బ్రాహ్మణి, తేజస్విని, మోక్షజ్ఞ)కు వాలీబాల్ అంటే ఎంతో మక్కువ అని హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి తెలిపారు. హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లిలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలబాలికల వాలీబాల్ పోటీలు ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. క్రీడాజ్యోతిని వెలిగించి, పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి దశనుంచే క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు ముఖ్యం కాదనీ, పాల్గొనడమే విజయమన్నారు.

-వివరాలు 7వ పేజీలో..

న్యూస్ బాక్స్

స్టాండర్డ్స్ పాటించాలి

● ప్రొఫెసర్ దేవకుమార్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ దేవకుమార్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్‌లో స్టాండర్డ్స్ పాటించాలని ఐఈఐ రాష్ట్ర గౌరవ కార్యదర్శి, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ దేవకుమార్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాల ఎస్‌ఆర్ఐటీలో సోమవారం ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ డేను ఘనంగా నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ రఘుబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌నకు ప్రొఫెసర్ దేవకుమార్, బీఐఈ డిప్యూటీ డైరెక్టర్ అఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నోవేషన్‌లో యువ ఇంజనీర్లు మంచి స్టాండర్డ్స్ పాటిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐఈఐ సెక్రెటరీ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, సివిల్ హెచ్‌ఓడీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్



విద్యార్థులను ప్రశంసిస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐటీఐలో ప్రవేశాలకు నాలుగో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. విద్యార్థులు 26వరకు https://iti.ap.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ పూర్తి అయిన విద్యార్థులకు 28న ప్రభుత్వ, 30న ప్రైవేట్ కళాశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. కాగా నెహ్రూ యువకేంద్రం నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలందజేసి సత్కరించారు.

కుండపోత



వేదవతి హగరిలో భారీగా ప్రవహిస్తున్న వరదనీరు

బొమ్మనహాళ్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు వేదవతి హగరి పొంగిపొర్లాయి. పత్తి, మొక్కజొన్న, జొన్న, మిరప తదితర పంటలు నీట మునిగాయి. భారీగా వరదనీరు రావడంతో వేదవతి హగరి ఉప్పొంగి ప్రవహించింది. మండలంలోని ఉద్దేహాళ్, గోనేహాళ్, శ్రీధరఘట్ట, సింగా నహళ్లి తదితర గ్రామాలలో కుండపోత వర్షం కురిసింది. సిద్ధరాంపురం, కురవళ్లి గ్రామాలలో మిరప, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి.

కోచింగ్‌కు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నిర్వహించనున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు గడువు పొడిగించినట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది వరకూ ఈ నెల 21 వరకు ఉన్న గడువును 25 తేదీ వరకూ పొడిగించినట్లు ఆమె తెలిపారు.

సమావేశం వాయిదా

అనంతపురం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సంక్షేమ సంఘం సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిగుప్ప వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదివరకు ఈనెల 23న అనంతపురం నగరం కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్ లో సమావేశాన్ని నిర్వహించడంతోపాటు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. త్వరలో తదుపరి తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

రేపు ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ అనంతపురం డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, అనంతపురం అర్బన్ సీడీపీఓ లలిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, శింగనమల, నార్పల, తాడిపత్రి, ఉరవకొండ ప్రాజెక్టులోని కూడేరు మండలాలల్లో అంగన్వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఎంపిక పారదర్శకంగా సాగుతుందని, మధ్యవర్తులను నమ్మవద్దన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇప్పుడైనా..!

● ఓడీ రద్దు కోసం ఎంపీఈఓల విశ్వప్రయత్నాలు

● చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న 106 మంది

● జిల్లాకు రప్పించాలని ప్రజాప్రతినిధులకు వినతి

● ఖరీఫ్ ఈ-పంట నమోదు తర్వాత పంపుతామన్న ఉన్నతాధికారులు

● హామీ అమలు కోసం నిరీక్షిస్తున్న చిరుద్యోగులు

అనంతపురం అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సొంత జిల్లాకు రావడానికి ఎంపీఈఓలు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ పాలనలో తమను ఓడీపై చిత్తూరుకు పంపి అన్యాయం చేశారని, మీరే న్యాయం చేయాలని ఇదివరకే వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలిసి విన్నవించారు. అలాగే వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. జిల్లా ప్రతినిధులతో సైతం సంబంధిత మంత్రి, అధికారులకు లేఖలు రాయించారు. గత జూలైలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపీఈఓలను జిల్లాకు రప్పించాలని అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సైతం కోరారు. దీంతో వ్యవసాయ కమిషనరేట్‌కు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం నుంచి లేఖ పంపారు. ఈ ఏడాది ఖరీఫ్ ఈ- పంట నమోదు పూర్తయిన తర్వాత ఓడీలు రద్దు చేసి అనంత జిల్లాకు పంపుతామని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఎంపీఈఓలకు హామీ ఇచ్చారు. ఈ పంట నమోదుతోపాటు ఈకేవైసీ పూర్తయినా ఇప్పటి దాకా ఇచ్చిన హామీ అమలు కాలేదు. దీంతో ఎంపీఈఓలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అరకొర జీతానికి అంతదూరమా..?

టీడీపీ పాలనలో 2015లో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఉమ్మడి అనంత జిల్లాలో 650 మంది ఎంపీఈఓ (మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)లను కాంట్రాక్టు పద్ధతిపై ఎంపిక చేశారు. అప్పట్లో 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించారు. వీరంతా వ్యవసాయ శాఖ తరఫున క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ వచ్చారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాల్లో కొత్తగా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్థక శాఖ తరఫున గ్రామ స్థాయి సిబ్బందిని నియమించింది. ఆర్బీకే సిబ్బంది నియామకాలతో ఎంపీఈఓలకు కష్టకాలం మొదలైంది. గతంలో ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలు పని చేసేవారు. వీరిలో 175 మంది వీఏఏలు పోస్టులకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో 4వేల ఎకరాల నుంచి 6వేల ఎకరాలకు ఒక ఆర్బీకేను ఏర్పాటు చేశారు. తద్వారా ఎంపీఈఓలకు అన్యాయం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలో జరగని విధంగా అనంత జిల్లా ఎంపీఈఓలను చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. 2021, 2022 సంవత్సరాల్లో రెండు విడతలుగా 253 మంది ఎంపీఈఓలను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. ప్రస్తుతం వీరిలో 106 మంది ఉమ్మడి చిత్తూరులో ఓడీపై పనిచేస్తున్నారు. మిగిలిన వారు అనారోగ్యం, ప్రసూతి సెలవులు, ఆర్థిక, కుటుంబ సమస్యలతో అక్కడ పనిచేయలేక తిరిగి వచ్చారు. వీరిలో 70 శాతం మంది మహిళా సిబ్బంది ఉండటం గమనార్హం. పేద కుటుంబాలకు చెందిన ఆ సిబ్బంది రూ.12వేల జీతం కోసం వారి కుటుంబ సభ్యులు, పిల్లలకు దూరంగా ఉంటూ పని చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో జనాభా ప్రతిపదికగా ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. 60 ఎకరాల నుంచి 500 ఎకరాల పరిధిలో కూడా ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. దీంతో వాటి సంఖ్య పెరిగింది. అనంత జిల్లాలో ఎక్కువ విస్తీర్ణానికి ఆర్బీకేలు ఏర్పాటు చేయడం ద్వారా ఇక్కడ పనిచేస్తున్న ఎంపీఈఓలకు అన్యాయం జరిగింది.



రైతు సేవా కేంద్రం



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి పత్రం ఇస్తున్న ఎంపీఈఓలు

ముమ్మరంగా వినతులు

వైసీపీ హయాంలో ఓడీపై చిత్తూరు జిల్లాకు ఎంపీఈఓలను పంపాలని నిర్ణయించిన నాటి నుంచి ఎంపీఈఓల సంఘం నాయకులు ఓడీ రద్దు చేసి, జిల్లాలోనే కొనసాగించాలని అప్పటి ప్రజాప్రతినిధులను అనేక సార్లు విన్నవించారు. ఉమ్మడి జిల్లాలో 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓ పోస్టును కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుందని విన్నవిస్తూ వచ్చారు. అయితే ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో తమకు న్యాయం జరుగుతుందన్న ఆశతో బాధిత ఎంపీఈఓలు పలు మార్లు కూటమి ప్రజాప్రతినిధులకు విన్నవించారు. ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరకపోవడంతో ఇకమీదట ఏమి చేయాలో తోచని అయోమయంలో పడ్డారు.



కుటుంబానికి దూరంగా..

నాది చెన్నేకొత్తపల్లి మండలం. వైసీపీ హయాంలో ఓడీపై చిత్తూరు జిల్లాకు పంపారు. నా భర్త రైతు. నాకు ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయికి ఆరేళ్లు, కుమారుడికి నాలుగేళ్లు. కుటుంబ అవసరాల రీత్యా తక్కువ వేతనమైనా తప్పని పరిస్థితుల్లో ఓడీపై చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్నా. పిల్లలను తలచుకుంటే కన్నీళ్లు వస్తాయి. నా భర్తే వారి ఆలనాపాలన చూస్తున్నారు. సెలవు రోజుల్లో ఊరికి వెళ్లి పిల్లలను చూసుకుంటున్నా. నాతోపాటు ఎక్కువ మంది మహిళలే ఓడీపై చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్నారు. అందరూ నాలాగే ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మాకు న్యాయం జరుగుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్నాం.

- నాగేశ్వరి, వ్యవసాయ శాఖ ఎంపీఈఓ



తిరుపతిలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావులకు వినతి పత్రం అందజేస్తున్న బాధిత ఎంపీఈఓలు



తక్షణమే ఓడీలు రద్దు చేయాలి

ఈ ఏడాది ఖరీఫ్ ఈ పంట నమోదు పూర్తికాగానే ఓడీలు రద్దు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ శాఖ కమిషనర్‌లు హామీ ఇచ్చారు. ఈ పంట నమోదు ఇప్పటికే పూర్తి చేశాం. ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఓడీలు రద్దు చేసి, సొంత జిల్లాకు పంపాలి. కూటమి ప్రభుత్వం మాకు న్యాయం చేస్తుందన్న నమ్మకం ఉంది. మంత్రితోపాటు ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ఉన్నతాధికారులు మేము వెళ్లిన ప్రతి సారి సానుకూలంగానే స్పందిస్తున్నారు. త్వరలో న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉంది.

- రెడ్డి ప్రసాద్, ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి

● రాయలసీమకు రూ.10వేల కోట్లు కేటాయించాలి

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

● కలెక్టరేట్ వద్ద ముగిసిన సీపీఎం బస్సు యాత్ర

అనంతపురం కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. జిల్లాకు సాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 19వ వరకు జిల్లా వ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టారు. యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎంఏ గఫూర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ అధ్వానంగా మారిందని విమర్శించారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునికీకరణ పనులను పూర్తి చేయకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. హంద్రీనీవా వెడల్పు చేస్తామని చెప్పిన హామీని విస్మరించారని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమ జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులకు రూ.10వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ జిల్లాకు చెందిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపి సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. మానవహక్కుల వేదిక నాయకుడు ఎస్ఎం బాషా మాట్లాడుతూ 14 సంవత్సరాలు గడుస్తున్నా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునికీకరణను ప్రభుత్వాలు పూర్తిచేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 2008లో చేపట్టిన హెచ్చెల్సీ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాంభూపాల్ మాట్లాడుతూ సాగునీటికోసం చేస్తున్న పోరాటం ఇంతటితో ఆగదని, ప్రభుత్వంలో చలనం తీసుకొచ్చేవరకూ సాగుతుందని స్పష్టం చేశారు. ధర్నా అనంతరం నగర ఎమ్మెల్యే, ఎంపీలను కలిసి సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నల్లప్ప, సావిత్రి, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, నాగమణి, రామాంజనేయులు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

అప్పటి డిమాండ్లు.. ఇప్పుడు నెరవేర్చండి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

గుంతకల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ వివిధ డిమాండ్లతో ఆందోళనలు చేసిందని, ఇప్పుడు అధికారంలో ఉన్నందు న వాటన్నింటిని నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఉదయం ఆయన విలేకఖరుల సమావేశాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో బీజేపీ ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రజాహిత పరిపాలనను తాము స్వాగతిస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందించిన ప్రజలు పాత పథకాలు, పాత ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతుందన్న నమ్మకంతో ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీనీవా వైడెనింగ్, రాగులపాడు లిఫ్టు, డ్రిప్ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగిందన్నారు. వాటన్నింటినీ పూర్తిచేసి, ఆశించిన మేరకు సాగునీరు అందించాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందని గుర్తు చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో నాలెడ్జి హబ్‌ను సాకారం చేయాలన్నారు. చార్జీలను పెంచడానికి విద్యుత్ శాఖ సమాయత్తమౌతోందని, కరెంటు చార్జీలను పెంచరాదన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందజేయాలన్నారు. సమావేశంలో గోవిందు, వీరభద్రస్వామి, మహమ్మద్ గౌస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్

అనంతపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బీమా పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో చేరడానికి 18ఏళ్ల నుంచి 50ఏళ లోపు ఉన్న మహిళలు అర్హులన్నారు. ఈ బీమాలో చేరినవారు సహజంగా మరణించినా ఆకుటుంబానికి రూ. 2లక్షలు పరిహారం ఇస్తారన్నారు. ఒకవేళ ప్రమాదంలో మరణించినా అంతేమొత్తం పరిహారంగా ఇస్తారన్నారు. 51సంత్సరాల నుంచి 70ఏళ్లలోపు వారికోసం ప్రధాన మంత్రి సురక్షాబీమా యోజన ద్వారా ప్రమాదంలో మరణిస్తే రూ.2లక్షలు పరిహారం ఇస్తారని తెలిపారు. ఈ రెండు పథకాలలో సభ్యత్వం పొందడానికి ఏడాదికి రూ.456లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అధికారులు ఈ బీమా పథకాలపై అవగాహన కల్పించి అర్హులైన మహిళలను చేర్పించాలని కోరారు.

ధరహాసమేదీ..?

● భారీగా పడిపోయిన ద్రాక్ష ధర

● కొనుగోలు చేయని వ్యాపారులు

● పొలంలోనే కుళ్లిపోతున్న పంట

● రూ.లక్షల్లో నష్టపోతున్న రైతులు



నేల రాలిన ద్రాక్ష



బండమీదపల్లిలో పొలంలోనే కుళ్లిపోయిన ద్రాక్ష


రాప్తాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ధర లేకపోవడం, వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు ద్రాక్ష రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొనేవారు లేక పంట కుళ్లిపోతుండటంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలోని రాప్తాడు, ప్రసన్నాయపల్లి, రామినేపల్లి, హంపాపురం, మరూరు, చెర్లోపల్లి, బండమీదపల్లి, గొందిరెడ్డిపల్లి, గాండ్లపర్తి, కొత్తపల్లి, బొమ్మేపర్తి తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా ద్రాక్ష పంట సాగు చేస్తారు. పందిరి ఏర్పాటు చేసి సీడ్‌లెస్, సీడ్, నల్ల, తెల్ల ద్రాక్ష సాగు చేశారు. సీడ్‌లెస్ ద్రాక్ష 250 ఎకరాలు, సీడ్ ద్రాక్ష 100 ఎకరాలు వరకూ సాగు చేశారు. గతేడాది ద్రాక్ష ధరలు ఆశాజనకంగా ఉండటంతో సాగు చేసిన రైతులకు శ్రమకు తగిన ఫలితం లభించేది. ఈ ఏడాది కూడా ఆయా గ్రామాల్లో రైతులు ద్రాక్ష సాగు చేశారు. సకాలంలో మందులు పిచికారీ చేసి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. పంట చేతికందే సమయంతో ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీడ్‌లెస్ ద్రాక్ష గతేడాది టన్ను రూ. 50 వేల నుంచి రూ.70 వేల వరకూ అమ్ముడుపోయింది. ఈ ఏడాది రూ. 20 వేలకు కూడా వ్యాపారులు అడగటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీడ్ ద్రాక్ష కూడా గతేడాది టన్ను రూ. 50 వేల వరకూ పలికింది. ఈ ఏడాది సీడ్ ద్రాక్షను వ్యాపారులు అడగడమే లేదని రైతులు వాపోతున్నారు. ద్రాక్షను వ్యాపారులు కొనుగోలు చేయకపోవడం, వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు పొలంలోనే పంట కుళ్లిపోతోంది. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టామని, కొనేవారు లేక తీవ్రంగా నష్టపోతున్నామని ద్రాక్ష రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధరలు తగ్గాయి

ఆగస్టు వరకూ ద్రాక్ష ధర బాగానే ఉండేది. రెండు నెలల నుంచి ధరలు తగ్గాయి. సీడ్ ద్రాక్ష పులుపు ఉండటంతో ఇక్కడి ప్రజలు తినడానికి ఇష్టపడరు. ఈ ద్రాక్షను వ్యాపారులు కొనుగోలు చేసి అస్సాం, బెంగాల్, బంగ్లాదేశ్ ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం వారు కూడా సీడ్ ద్రాక్షను కొనేందుకు ఆసక్తి చూపడం లేదు.

-రత్నకుమార్, ఉద్యానశాఖ అధికారి


రూ.8 లక్షలు ఖర్చు పెట్టా..



ఆరేళ్ల కిందట ద్రాక్ష సాగు చేయడం ప్రారంభించా. పందిరి ఏర్పాటు చేసి దిల్‌కుష్ రకం సీడ్ ద్రాక్ష సాగు చేశా. ప్రతి ఏడాది ధరలు బాగా ఉండటంతో శ్రమకు తగిన ఫలితం లభించేది. ఈ ఏడాది రెండున్నర ఎకరాల్లో ద్రాక్ష సాగుకు రూ. 8 లక్షలు ఖర్చు పెట్టా. దాదాపు 30 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ. 20 వేలకు కూడా వ్యాపారులు కొనడం లేదు.

- ప్రసాద్, బండమీదపల్లి

పొలంలోనే కుళ్లిపోతోంది



ఒకటిన్నర ఎకరాలో దిల్‌కుష్ రకం సీడ్ ద్రాక్ష సాగుకు రూ. 5లక్షలు ఖర్చు చేశా. ఏడాది కాలం పంటకు తెగుళ్లు, వైరస్‌లు రాకుండా జాగ్రత్తగా కాపాడుకున్నాం. ఆగస్టు వరకూ టన్ను ద్రాక్ష రూ. 50 వేలు ఉండేది. రెండు నెలల నుంచి ద్రాక్ష ధరలు చాలా తగ్గాయి. టన్ను ద్రాక్ష రూ. 20 వేలకు కూడా వ్యాపారులు కొనుగోలు చే యడం లేదు. వర్షాలకు ద్రాక్ష కుళ్లిపోయి పొలంలోనే రాలిపోతోంది. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించాలి.

- వెంకటనాయుడు, బండమీదపల్లి

126 అంకెలు కాదు... బాలుడి పేరు

● అన్ని రికార్డుల్లోనూ అదే పేరు



126 పేరు ఉన్న బాలుడు

తాడిపత్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అభిరుచి ఉంటుంది. అది వారు ఆదర్శం కోసం చేసినా ఇతరులకు మాత్రం వైవిధ్యంగా కనిపిస్తుంది. ఇలాంటి కోవకు చెందినదే ఓ పిల్లాడికి పెట్టిన పేరు. సాధారణంగా తమ పిల్లలకు దేవుడికి సంబంధించినది కానీ తమ పూర్వీకులకు సంబంధించిన పేరు కానీ పెట్టుకుంటారు. ఇంకా కొందరు వెరైటీ కోసం ఇంటర్‌నెట్‌లో చూసి వినూత్నంగా ఉండేలా పెడతారు. కానీ తాడిపత్రికి చెందిన ఓ టీచర్ తన కుమారుడికి అంకెలతో పేరు పెట్టడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తాడిపత్రిలోని సుంకులమ్మపాలెంకు చెందిన రాఘవేంద్ర, ప్రశాంతి దంపతులు తమ కుమారుడికి 126 అంటూ అంకెలతో పేరు పెట్టారు. రాఘవేంద్ర పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆధార్‌కార్డు, డేట్‌ఆఫ్‌బర్త్ సర్టిఫికెట్, పాఠశాల రికార్డుల్లో కూడా 126గా నమో దు చేయించాడు. ఎందుకిలా అని ప్రశ్నిస్తే 126 అంకెల్లో 1 అంటే ఐ, 2 అంటే యామ్, 6కి ఇండియన్ అని అర్థం వచ్చేలా పెట్టానన్నా రు. కుల, మత బేధాలు ఉండకుండా అందరూ భారతీయులుగా జీవించాలనే ఉద్దేశ్యంతోనే తాను ఈ పేరు పెట్టినట్లు తెలిపారు. తన కుమారుడికి ప్రస్తుతం ఆరేళ్ల వయసు ఉన్నా, పుట్టిన కొన్నిరోజులకే 126పేరు పెట్టానని, ప్రస్తుతం ప్రాచుర్యంలోకి వచ్చిందని తెలిపాడు. కుమారుడు పుట్టకమునుపే ఈ పేరు పెట్టాలని ఆలోచించి పెట్టుకున్నానని ఆయన తెలిపారు.



తల్లిదండ్రులతో.. 126

సంక్షిప్తం

టమోటా కిలో రూ.50



అనంతపురం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.50తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.37, కనిష్ఠ ధర రూ.26పలికినట్లు ఆయన తెలిపారు.

జీడిపల్లికి 1174 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1174 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1160 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

25న జాబ్‌మేళా

అనంతపురం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఆమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని మాస్టర్ మైండ్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. ముత్తూట్ గ్రూప్, టాటా ఎల్ట్రానిక్స్, క్యాపిటల్, ఐఐఎఫ్ఎల్ సంస్థ, బి-న్యూ, ఎస్‌బిఐకార్డ్స్ సంస్థలు జాబ్‌మేళాలలో పాల్గొంటాయన్నారు. కనీస విద్యార్హత ఇంటర్, డిగ్రీ పాస్ అయి ఉండి..18నుంచి 30ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. వివరాలకు 8143420834నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పుట్టగొడుగులు తిని పలువురికి అస్వస్థత

చిలమత్తూరు/హిందూపురం అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పొలంలో వర్షానికి పుట్టుకొచ్చిన పుట్టగొడుగులు తిని ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. చిలమత్తూరు మండలంలోని ఆదెప్పల్లికి చెందిన వెంకటశివప్ప ఉదయం పొలంలోకి వెళ్లి వస్తుండగా పుట్టగొడుగులు కనిపించాయి. ఆయన వాటిని కోసుకొని ఇంటికి తీసుకొచ్చాడు. పుట్టగొడుగులు పూర్తిగా విచ్చుకోవడమే కాకుండా వాటిలో కొన్ని ముందురోజున మొలకొత్తినవి కావడంతో అవి ఫంగస్ సోకి ఉన్నాయి. ఈ విషయాన్ని గమనించకుండా తీసుకొచ్చిన వాటన్నింటినీ వండుకుని తిన్నారు. దీంతో వాటిని తిన్న ఇంట్లోని వారందరికీ వాంతులు, విరోచనాలు అయి, తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. స్థానికులు 108 వాహన సాయంతో వెంకటశివప్పతోపాటు కుటుంబ సభ్యులు అలివేలమ్మ, శాంతమ్మ, శ్రీనివాసులు, గంగ, శివ, లక్ష్మిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

కోలుకోలేని దెబ్బ..

చేనేత పరిశ్రమకు భారీ వర్షాల ఎఫెక్ట్
మగ్గం గుంతల్లోకి చేరిన నీరు
మరో వారం రోజులు పనులకు ఆటంకం
ఉపాధి కోల్పోతున్న నేతన్నలు
రూ.2కోట్లకుపైగా నష్టం

ధర్మవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న చేనేత పరిశ్రమను భారీ వర్షాలు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. చేనేత పరిశ్రమకు పెను నష్టం మిగులుస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. దీంతో మగ్గం నేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో జిల్లావ్యాప్తంగా 50 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా పరిశ్రమపై ఆధారపడిన వారు ఉపాధి కోల్పోతున్నారు. వారం రోజుల్లో రూ.2కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు చేనేత వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక్కో చేనేత కార్మికుడు నెలకు 5 నుంచి 6 చీరలు నేస్తాడు. ఒక్కో చీరకు చీరకు సగటున కూలి రూపంలో రూ.4వేలు దక్కుతుంది. ఈ మొత్తం చేనేత కార్మికులు నష్టపోతున్నారు. మాస్టర్ వీవర్స్ కూడా అంతేస్థాయిలో నష్టపోతున్నారు.

పరిశ్రమ అతలాకుతలం

భారీ వర్షాలు కురిశాయంటే చేనేత పరిశ్రమకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పట్టుచీర తయారు చేసే రేషం దారానికి తేమ అవడంతో మగ్గాలు ముందుకు సాగలేని పరిస్థితి ఏర్పడుతుంది. జిల్లాలో 70 శాతం మంది ధర్మవరంలోనే చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏ ఇంటికెళ్లినా మగ్గాలు కనిపిస్తాయి. వాటి శబ్దాలు వినిపిస్తాయి. వర్షాల కారణంగా మగ్గం మూగబోయింది. మగ్గాల గుంతల్లోకి నీరు చేరింది. వర్షపు నీరు ఇళ్లలోకి వస్తుందేమోనన్న భయంతో మగ్గాలను చుట్టేశారు. పనులు లేక ఖాళీగా గడుపుతున్నారు. వారం రోజులపాటు పనులు లేకపోవడంతో పరిశ్రమ అతలాకుతలమైంది.



తడిసిన మగ్గం సామాన్లను ఆరపెట్టిన దృశ్యం

ధర్మవరంలో భారీ నష్టం

ధర్మవరంలోని దిగువ ప్రాంతాలైన చంద్రబాబునగర్, శాంతినగర్, సంజయ్‌నగర్, జోగోనికుంట, పార్థసారధి నగర్, శివానగర్, కేశవనగర్ తదితర ప్రాంతాల్లో మగ్గం గుంతల్లోకి నీరు చేరడం, ఊట ఏర్పడటంతో మగ్గాలను పూర్తిగా చుట్టిపెట్టారు. వారంరోజులుగా పనులు లేక చేనేత కార్మికులు పస్తులుండే పరిస్థితి దాపురించింది. వాతావరణ శాఖ మళ్లీ వర్షాల హెచ్చరిక జారీ చేస్తుండడంతో నేతన్నల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి.

ఆ పథకాన్ని పునరుద్ధరించాలి

గత టీడీపీ హయాంలో ఆగస్టు నుంచి నవంబరు వరకు దాదాపు 4నెలలపాటు వర్షాలను దృష్టిలో పెట్టుకుని, ఒక్కో చేనేత కుటుంబానికి రూ.4వేలతోపాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పథకానికి మంగళం పలికింది. నేతన్నల పొట్టకొట్టిందని కార్మికసంఘాలు మండిపడుతున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో కష్టకాలంలో ఆదుకుంటుందని చేనేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అమలు చేసిన పథకాన్ని పునరుద్ధరించాలని కార్మికసంఘాలు కోరుతున్నాయి.



మగ్గం గుంతల్లోకి చేరిన వర్షపు నీరు

వారం రోజులుగా ఉపాధిలేదు



వరుస వర్షాల కారణంగా మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. మగ్గం సామగ్రి పూర్తిగా తడిసిపోయాయి. నీరు నిల్వ ఉండటంతో వారం రోజులుగా ఉపాధి కోల్పోయాం. మగ్గం సామగ్రి అరబెట్టడానికి 15 రోజులు పడుతుంది. అప్పటి వరకు పస్తులుండాల్సి వస్తోంది. ప్రభుత్వం వర్షాకాల భృతి అందించి, ఆదుకోవాలి.

- రంగం బాలక్రిష్ణ, చేనేత కార్మికుడు, మాధవనగర్

పురానికి క్రీడాసంబరం

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ వాలీబాల్ పోటీలు ప్రారంభం
26 జిల్లాల నుంచి 600 మంది రాక



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారిణులు

హిందూపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి క్రీడా పండుగ వచ్చింది. ముద్దిరెడ్డిపల్లిలో 68వ రాష్ట్రస్థాయి ఏపీ స్కూల్ గేమ్స్ అండర్-17 బాలబాలికల వాలీబాల్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి క్రీడాజ్యోతిని వెలిగించి, పోటీలకు శ్రీకారం చుట్టారు. ఆయా జిల్లాల జట్లు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. క్రీడాకారుల గౌరవ వందనాన్ని శాప్ చైర్మన్ స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. క్రీడాకారులకు మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు, మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. నందమూరి తారకరామారావు 1986లోనే హిందూపురంలో ఇండోర్ స్టేడియం నిర్మించారన్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2027లో జాతీయస్థాయి క్రీడాపోటీలు రాష్ట్రంలో నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. గత వైసీపీ హయాంలో క్రీడలు, క్రీడాకారులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో క్రీడాశాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. ఎంపీఆర్ (మిడ్‌పెన్నార్) డ్యాం నుంచి ఉత్తర కాలువకు సాగునీరు సోమవారం విడుదల చేశారు. మండల టీడీపీ ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్‌తో కలిసి గంగపూజ చేసి ఉత్తర కాలువకు నీరు విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. రాయలసీమను రతనాల సీమ చేయాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే ఉత్తర కాలువకు సాగునీరు విడుదల చేయడం సంతోషకరమన్నారు. ఎంపీఆర్ డ్యాం గేట్లు పాడైపోయి డ్యాంలో నీరంతా వృథాగా పోతున్న గత వైసీపీ ప్రభుత్వం స్పందించిన పాపాన పోలేదని విమర్శించారు. దీపావళి పండుగ కంటే ముందే సాగునీరు విడుదల చేసి రైతుల కళ్లలో వెలుగులు చూడటం ఆనందంగా ఉందన్నారు. చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్ చౌదరి, మునలిరెడ్డి, జింకల సంజీవకుమార్, పాల్గొన్నారు.



గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

క్రైం కార్నర్

ఎంతపని చేస్తివి నాయనా ?

యువకుడి ఆత్మహత్యతో రోదించిన తండ్రి
రెండురోజుల తరువాత ఘటన వెలుగులోకి



కొప్పలకొండ మధు (ఫైల్)

గార్లదిన్నె, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి): 'ఆరోగ్యం బాగాలేదు. ఆసుపత్రికి వెళ్లి వస్తానని చెప్పి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నావా ? ఎంత పని చేశావు నాయనా' అంటూ కుమారుడి మృతదేహం వద్ద తండ్రి విలపించిన తీరు చూపరులతో కంటతడి పెట్టించింది. పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన కొప్పలకొండ మధు(27) ఇంటర్మీడియట్ వరకూ చదువుకొని వ్యవసాయంలో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. ఇతడికి ఏడాది కిందటే వివాహమైంది. కొద్దిగా అనారోగ్యంగా ఉందని, ఆసుపత్రికి వెళ్లి వస్తానని శనివారం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరాతీశారు. పలుచోట్ల గాలించారు. అయితే కనుంపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన గల గుట్టలో మధు మృతదేహం, వాహనాన్ని గమనించిన గొర్రెలకాపరులు పోలీసులకు సమాచారం చేరవేశారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్ గౌస్ బాషా సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద పురుగుల మందు డబ్బా, వాటర్ బాటిల్ ఉండటంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. రెండు రోజులు కిందటే మృతి చెంది ఉంటాడని అభిప్రాయపడ్డారు. మృతదేహం నల్లగా మారిపోయింది. మృతదేహంపై ఉన్న దుస్తులు, ద్విచక్ర వాహనాన్ని పరిశీలించి, పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన మధుగా మృతుడిని గుర్తించారు. వెంటనే మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి మృతుడు తమ కుమారుడే అంటూ బోరున విలపించారు. మృతదేహాన్ని పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రాగా ఒడిషా, అరుణాచల్‌ప్రదేశ్ మ్యాచ్

మధ్యప్రదేశ్‌పై లడక్ విజయం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒడిషా, అరుణాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మహిళా ఫుట్ బాల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో రాజామాత జీజీబాయి సీనియర్ మహిళల జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలు సోమవారం కొనసాగాయి. మొదటి మ్యాచ్‌లో మధ్యప్రదేశ్‌పై లడక్ రెండు పాయింట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్ అరుణాచల్ ప్రదేశ్, ఒడిషా జట్ల మధ్య ఉత్కంఠగా సాగింది. చివరికి ఫలితం తేలకుండానే డ్రాగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డేనియల్ ప్రదీప్, ఆర్డీటీ మేనేజర్ శ్రీదేవి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి మల్లేష్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రహ్లాద్, సుదర్శన్, నాగరాజు, కోఆర్డినేటర్ దాదాకలందర్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బీఎన్ కబడ్డీ జట్టు హ్యాట్రిక్ విజయం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ పోటీల్లో ఎస్ఎస్‌బీఎన్ జట్టు హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్కేయూ అంతర్ కళాశాలల గ్రూప్-బి పోటీలు సోమవారం ముగిశాయి. కబడ్డీ పోటీల్లో ఫైనల్ పోరు రసవత్తరంగా సాగింది. ఉత్కంఠగా సాగిన కబడ్డీ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల జట్టుపై ఎస్ఎస్‌బీఎన్ 30పాయింట్ల తేడాతో గెలుపొంది హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకుంది. అలాగే బాస్కెట్‌బాల్ పోటీలలో ఎస్ఎస్‌బీఎన్ జట్టు గెలుపొందగా, ఎస్కేయూ కాలేజీ రన్నర్‌గా నిలిచింది. షటిల్ బ్యాడ్మింటన్‌లో ఎస్ఎస్‌బీఎన్‌పై ఆర్ట్స్ కళాశాల జట్టు విజయం సాధించింది. ఓవరాల్ చాంపియన్‌గా ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నిలిచింది. ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జెస్సీ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రాజు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాప్ కోచ్‌లు అనీల్‌కుమార్, వంశీ, సంధ్య, పీడీలు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మిద్దెకూలి చిన్నారికి తీవ్రగాయాలు





కల్లుకుంటలో కుప్పకూలిన ఇల్లు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి నీరజ

పెనుకొండ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని కల్లుకుంట గ్రామంలో పాత మిద్దె కూలి బాలాజీ కుమార్తె నీరజ(5)కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాలాజీ, అతడి భార్య సోమవారం పని నిమిత్తం బయటికెళ్లారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వారు ఉంటున్న మిద్దె నానిపోయి, కూలింది. ఇంట్లో ఉన్న చిన్నారి నీరజ తీవ్రంగా గాయపడింది. చిన్నారిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి బెంగళూరుకు తరలించినట్లు బంధువులు తెలిపారు. ప్రమాదంలో మరో బాలుడికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం.

కాల్పుల ఘటనపై దర్యాప్తు ముమ్మరం

నకిలీ బంగారు ముఠాకు తెలంగాణ పోలీసుల వల..?
పట్టుకునే క్రమంలో ఎయిర్ గన్‌తో కాల్పులు..?
దర్యాప్తునకు శ్రీసత్యసాయి జిల్లా నుంచి రెండు బృందాలు
తెలంగాణ, అన్నమయ్య జిల్లాల్లో విచారణ
పోలీసుల అదుపులో షికారుపాళ్యం ముఠా సభ్యుడు



పుట్టపర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లి మండలం రామాపురంలో ఆదివారం జరిగిన కాల్పుల ఘటనపై శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు విచారణ వేగవంతం చేశారు. కాల్పుల ఘటనలో పాల్గొన్నవారి వివరాలను ఆరా తీస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురంలో ఆదివారం ఉదయం కాల్పుల ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. రెండు బృందాలుగా విడిపోయి.. తెలంగాణ, అన్నమయ్య జిల్లాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా షికారుపాళ్యంకు చెందిన పేరుమోసిన నకిలీ బంగారు విక్రయించే ముఠా.. తెలంగాణ ప్రాంతంలో ఇటీవల భారీ మోసాలకు పాల్పడింది. చౌకగా బంగారు ఇస్తామని ఆశ చూపి పలువురిని మోసగించింది. ఈ ముఠాపై నిఘా పెట్టిన తెలంగాణ సైబర్ క్రైం పోలీసులు.. ఆచూకీ కనుగొని వల వేశారు. తెలంగాణకు చెందిన కొందరిని రంగంలోకి దింపి.. తక్కువ ధరకు బంగారు కావాలని నకిలీ బంగారు ముఠాను కోరారు. శ్రీసత్యసాయి జిల్లా రామాపురానికి వస్తే బంగారు అందజేస్తామని షికారుపాళ్యం ముఠా చెప్పడంతో.. తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు వెంట ఉండి.. కొనేవారిని రంగంలోకి దించారు. రెండు కార్లలో వారు రామాపురానికి ఆదివారం ఉదయం వచ్చారు. వచ్చింది పోలీసులని పసిగట్టిన షికారుపాళ్యం ముఠా పరుగులు తీసింది. వారిని అదుపులోకి తీసుకునేందుకు తెలంగాణ సైబర్ క్రైం పోలీసులు ఎయిర్ గన్‌తో కాల్పులు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. కాల్పులు జరిపిన వారి కారు నంబర్లను బత్తలపల్లి టోల్‌గేట్‌లో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు గుర్తించారు. తెలంగాణ కార్లుగా నిర్ధారించుకుని, వారికి ఫోన్ చేశారు. తాము తెలంగాణ సైబర్ క్రైం పోలీసులమని వారు ధర్మవరం పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది. తెలంగాణలో నకిలీ బంగారం విక్రయించిన ముఠాను పట్టుకునేందుకే వచ్చామని, పారిపోతున్న ముఠాపై ఎయిర్ గన్‌తో కాల్పులు జరిపామని వారు చెప్పినట్లు సమాచారం.

టీ-పోలీసుల పాత్ర లేదా..?

రామాపురంలో కాల్పుల ఘటనపై బత్తలపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. కాల్పుల్లో తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసుల ప్రాతలేదని, నకిలీ బంగారు విక్రయించే రెండు ముఠాల మధ్య జరిగిన బెదిరింపు కాల్పులని పోలీసులు అంటున్నారు. కాల్పుల్లో తెలంగాణ సైబర్ క్రైం పోలీసుల పాత్ర ఉన్న నేపథ్యంలో గోప్యంగా విచారిస్తున్నారు. షికారుపాళ్యానికి, తెలంగాణకు రెండు పోలీసు బృందాలను ఉన్నతాధికారులు పంపించారు. కాల్పులు జరిపింది తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులా..? లేక ముఠా సభ్యులా..? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. రాయచోటి నియోజకవర్గంలోని షికారుపాళ్యం నకిలీ బంగారు ముఠా సభ్యుల్లో ఒకరిని ఆదివారమే అదుపులోకి తీసుకున్నారని విశ్వసనీయంగా తెలిసింది. అతని ద్వారా ముఠా గురించి ఆరా తీస్తున్నారు. ఈ కేసు చిక్కుముడి వీడేందుకు మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉంది.

ఘోరం..

బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకుల మృతి
యువతికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, అక్టోబరు 21: రొద్దం మండలం ఎల్‌జిబి నగర్ సమీపాన పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. రొద్దం ఎస్సీ కాలనీకి చెందిన శేషాద్రి(20), అదే మండలంలోని కోగిర గ్రామానికి చెందిన గంగాద్రి(23) మరణించగా.. శేషాద్రి చెల్లెలు దివ్యశ్రీ తీవ్రంగా గాయపడింది. రొద్దం ఎస్ఐ నరేంద్ర తెలిపిన వివరాల మేరకు.. హరిజన నరసింహులు కుమారుడు శేషాద్రి ఓ పరిశ్రమలో పని చేస్తుండేవాడు. తన చెల్లెలు దివ్యశ్రీ డిప్లమో సెకెండియర్ చదువుతోంది. ఆదివారం దివ్యశ్రీ ధర్మవరం నుంచి విజయవాడకు వెళ్లే రైలు మిస్ అయింది. శేషాద్రి ధర్మవరానికి ద్విచక్రవాహనంలో వెళ్లి, ఆమెను ఎక్కించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఎల్‌జిబినగర్ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్దకు రాగానే ఎదురుగా ద్విచక్రవాహనంలో వస్తున్న హరిజన గంగాధర్ ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శేషాద్రి మృతిచెందాడు.





విలపిస్తున్న శేషాద్రి కుటుంబ సభ్యులు, శేషాద్రి (ఫైల్)

గంగాద్రి, దివ్యశ్రీని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున గంగాద్రి చనిపోయాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు శేషాద్రి మృతిచెందడంతో కుటుంబీకులు, బంధువులు బోరున విలపించారు. వారి ఆర్తనాదాలతో ఆస్పత్రి ప్రాంగణం మార్మోగింది.



వంకమద్ది ప్రాథమిక పాఠశాల



పెచ్చులూడిన గది

శిథిలావస్థలో పాఠశాల...!

కూలేందుకు సిద్ధంగా ఉన్న వంకమద్ది ప్రాథమిక పాఠశాల

నంబులపూలకుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకమద్ది ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో పిల్లలు ఓ ఇంట్లో చదువుకునేలా ఆ గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈఓ గోపాల్‌నాయక్ ఆ పాఠశాల భవనాన్ని సోమవారం పరిశీలించారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

బీమబోయనపల్లికి దారేదీ..?

నంబులపూలకుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పడమరనడింపల్లి పంచాయతీలోని బీమబోయనపల్లికి ఉన్న మట్టి రోడ్డు ... ఈ వర్షాలకు మరీ ఘోరంగా మారింది. మొత్తం బురద.. బురదగా మారింది. ద్విచక్రవాహనంలో కాదుకదా.. కనీసం నడుచుకుంటూ వెళ్లడానికి కూడా వీలులేని విధంగా తయారైంది. తమ గ్రామానికి సీసీ రోడ్డు మంజూరు చేసి ఆదుకోవాలని ఆ గ్రామస్థులు రత్నమయ్య, రామక్రిష్ణ, రమణయ్య, లక్ష్మీదేవి, రమణమ్మ కోరుతున్నారు.

బీమబోయనపల్లికి వెళ్లే రహదారి ➤





ఈకేవైసీ తప్పనిసరి

పుట్టపర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : గ్యాస్ వినియోగదారులందరూ తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలని ఎల్‌పీజీ డీలర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీ రాజీవ్ దేవ్ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... గ్యాస్ వినియోగదారులు ఆయా గ్యాస్ డీలర్లను కలిసి.. ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

భానుజాకు కృషిరత్న అవార్డు

కదిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రెడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు భానుజా సోమవారం కృషిరత్న అవార్డు అందుకున్నారు. ఆమె 20 సంవత్సరాలుగా రైతులను చైతన్య పరచడమే కాకుండా... మహిళ రైతుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ అందరికి ఆదర్శంగా నిలిచారు. సెట్రీస్ ఫౌండేషన్ వారి సహకారంతో ఉమ్మడి జిల్లాలోని ఐదు మండలాల్లో రైతులకు ఉచితంగా లక్షల పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. డాక్టర్ ఖాదరవలీ సిరిధాన్యాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేందుకు కృషి చేశారు. ఇందుకు గాను ఆమెను ముపావారపు ఫౌండేషన్, రైతు నేస్తం వారు కృషిరత్న అవార్డుకు ఎంపిక చేశారు. సోమవారం విజయవాడలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆమెకు కృషి రత్న అవార్డును అందజేసి సన్మానించారు.



భానుజాను సన్మానిస్తున్న వెంకయ్యనాయుడు

బాధ్యతగా సభ్యత్వ నమోదు చేయండి : ఎమ్మెల్యే

కదిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈనెల 26 నుంచి నిర్వహిస్తున్నామని, ఇందులో అందరూ బాధ్యతయుతంగా పని చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూతులు.. సామాజిక వర్గాల వారీగా పూర్తి చేయాలన్నారు. టీడీపీలో సభ్యత్వం తీసుకుంటే రూ.ఐదు లక్షల బీమా ఉంటుందని, ఇతర సౌకర్యాలు కూడా అందుతాయని అన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 12 మంది బాధితులకు మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్షాన్, పర్వీనాభాను, పవన్‌కుమార్‌రెడ్డి, బాహుద్దీన్, మనోహర్‌నాయుడు, ఎంఎస్ ఫయాజ్, రాజశేఖర్‌బాబు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

రైతులకు మొక్కల పంపిణీ

నల్లచెరువు : మండలంలోని సంజీవపల్లిలో సోమవారం వీరాశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో వనస్పతి స్వచ్ఛంద సంస్థ ద్వారా రైతులకు మొక్కల పంపిణీ చేశారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రైతులకు ఆ మొక్కలు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాబూ సాబ్, సర్పంచ్ హర్షవర్ధన్‌నాయుడు, ప్రసాద్ నాయుడు, జయ పాల్గొన్నారు.

కాలనీల్లో నీటి సమస్య

నల్లచెరువు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక వీవర్స్ కాలనీ, బీసీ కాలనీ, నల్లగుట్టవీధిలో నెల రోజుల నుంచి నీటి సమస్య నెలకొంది. నీటిని సరఫరా చేసే మోటార్లు కాలిపోవడంతో కొళాయిల ద్వారా నీరు రావడం లేదు. తాగునీటిని ఆర్వో ప్లాంట్ల వద్ద కొంటున్నామని, ఇక స్నానాలకు, పశువులకు నీటిని కూడా కొనాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులకు, సర్పంచ్‌కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని మండిపడ్డారు. కాలనీలకు సమీపంలో వ్యవసాయ బోర్లు కూడా లేపోవడంతో వాడకానికి నీటిని కొనాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి మోటార్‌కు మరమ్మత్తు చేయించాలని కోరారు.

పొలాలకు వెళ్లే రహదారి పరిశీలన

కొత్తచెరువు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి పొలాలకు వెళ్లేందుకు రహదారి ఏర్పాటుకు తహసీల్దార్ నీలకంఠారెడ్డి సర్వేయర్ సురేశ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. రైల్వే గేటు మూసివేసి.. అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయడంతో కొన్ని పొలాలకు రహదారి లేకుండా పోయింది. ఈ సమస్యను కొన్ని రోజుల కిత్రం రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. పంటలను ఇంటికి తరలించుకోవాలంటే ఇబ్బందిగా ఉందని రైతులు వాపోయారు. దీంతో తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వోలు సోమవారం ఆ పొలాలను పరిశీలించారు.



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు

కొత్తచెరువు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి సందర్భంగా స్థానికంగా సోమవారం నిర్వహించిన ఎడ్లబండ్ల పరుగు పందెం పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేతలకు ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి లెజెండ్ ధర్మవరం ఎద్దులకు రూ. 40 వేలు, ద్వితీయ బహుమతి వాలి సునామి వెంకటేశ్ ఎద్దులకు రూ. 30 వేలు, తృతీయ బహుమతి శ్రీధర్ నాయుడు ఎద్దులకు రూ. 20 వేలు, నాల్గవ బహుమతి చలపతినాయుడు ఎద్దులకు రూ. 10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, అడపాల రామక్రిష్ణ, ఒలిపి శీన, డిపో భాస్కర్, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, బండ్లపల్లి రాజు, వాల్మీకి సంఘం నాయకులు బానుప్రకాశ్, విజయ్, శ్రీనివాసులు, నాగేంద్ర, బండి లక్ష్మన్న, అక్కులప్ప, సాకే నరసింహులు, యల్లప్ప, సూర్య, రామకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ధర్మవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో ఈ నెల 19న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 కబడ్డీ పోటీల్లో ధర్మవరంలోని కొత్తపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు హస్మిత, నవ్య ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఆ పాఠశాల హెచ్‌ఎం మేరివర కుమారి, పీఈటీ అశ్విని, సిబ్బంది అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు..



నంబులపూలకుంట : ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని తూర్పు నడింపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని శిరీషా ఎంపికైంది. ఆ విద్యార్థినిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

కుళ్లిన పంట పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నల్లమాడ అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిప్పయ్యగారిపల్లిలతో రైతు భాస్కర్‌రెడ్డి సాగు చేసిన వేరుశనగ ఇటీవల వర్షాలకు వేరుశనగ కట్టె కుళ్లడంతో పాటు.. కాయలు మొలకలు వచ్చాయి. దీనిపై ఆంధ్రజ్యోతి సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఏఓ సుమతి కుళ్లిన వేరుశనగ కట్టెను, మొలకలొచ్చి నల్లగా మారిన కాయలను పరిశీలించారు. నష్టంపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు.



కుళ్లిన వేరుశనగను పరిశీలిస్తున్న ఏఓ

భూ రీసర్వేపై గ్రామసభ

బత్తలపల్లి అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్రాచెరువులో సోమవారం భూ రీసర్వే పై గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ స్వర్ణలత మాట్లాడుతూ రీ సర్వేలో రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సభకు మొత్తం 36 అర్జీలు వచ్చయని తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ సర్వేర్ జోసఫ్, వీఆర్ఓ విష్ణు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని మద్దివారిగొందిలో సోమవారం భూరీసర్వే గ్రామ సభను ఇన్‌చార్జీ తహసీల్దార్ బాబురావు నిర్వహించారు. ఈ గ్రామభలో 20 మంది రైతులు ఫిర్యాదులు అందజేశారన్నారు. రికార్డులను పరిశీలించి ఆసమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సభలో రెవెన్యూ అధికారులు జాఫర్‌వలీ, విలేజ్ సర్వేయర్ గణేష్ పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

ధర్మవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న అమరవీరుల స్థూపానికి సోమవారం పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఇందులో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, ఎస్ఐ గోపీకుమార్, ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరాముడు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సిబ్బంది, పలువురు రక్తదానం చేశారు. మొత్తం 73 మంది రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కేతన్న, రక్తబంధం ట్రస్టు వ్యవస్థాపకులు కన్నా వెంకటేశ్, సభ్యులు చంద్ర పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ముదిగుబ్బలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సీఐ శ్యామరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పీవీఎస్ పాఠశాల విద్యార్థులకు పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రాజు, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధర్మవరం : అమరవీరుల స్తూపం వద్ద సీఐలు,ఎస్ఐ, సిబ్బంది



ముదిగుబ్బ : ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

పుట్టపర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ధర్మవరానికి చెందిన పెళ్లి బృందం 2022 మార్చి 26న తిరుపతికి వెళ్తుండగా.. బాకరా పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 10 మంది మరణించగా.. 41 మంది గాయపడ్డారు. చనిపోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడిన ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారని కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఈ ఆర్థిక సాయం అందించామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని దీక్ష

ధర్మవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఒక రోజు దీక్ష చేపట్టారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛభారత్ పేరుతో కార్మికులను ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ పనిచేయిస్తూ వారికి కేవలం రూ.6 వేలు, కంటెంజెంట్ ఆయాలకు రూ 4 వేలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. వారికి కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ-2 గోపాల్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ దీక్షలో నాగవేణి, జయమ్మ, చౌడమ్మ, ముంతాజ్ పాల్గొన్నారు.

కూలీ ఆత్మహత్య

తాడిమర్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నొప్పులు భరించలేక మండలంలోని నారసింపల్లి గ్రామానికి చెందిన కూలీ చిరంజీవి (45) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చిరంజీవి రాళ్లు కొట్టడానికి ధర్మవరం మండలం ఏలుకుంట్ల గ్రామానికి ప్రతి రోజు వెళ్లి వచ్చేవాడు. పనులు ముగించుకుని తిరిగి గ్రామానికి వచ్చే సమయంలో మద్యం సేవించేవాడు. రెండు సంవత్సరాల క్రితం నాగలూరు వద్ద .జరిగిన రోడ్డు ప్రమాదంలో చిరంజీవి తలకు గాయం కావడంతో సర్జరీ జరిగింది. అప్పటినుంచి ఒంటి నొప్పులు ఎక్కువగా ఉన్నాయని బాధపడేవాడు. ఆదివారం సాయంత్రం కూడా నొప్పులు భరించలేక.. అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అతను భార్య రమణమ్మతో గొడవ పడటంతో.. ఆమె భరించలేక తన పిల్లలతో సహా పక్కింటికి వెళ్లి.. తలదాచుకుంది. కొద్దిసేపు తర్వాత అతని కుమార్తె వచ్చి చూడగా.. చిరంజీవి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఉండటాన్ని గమనించి.. తమ అమ్మకు, చుట్టుపక్కల వాళ్లను సమాచారం చేరవేసింది. వెంటనే స్థానికులు అతన్ని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తాడిమర్రి ఎస్ఐ నాగాస్వామి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. చిరంజీవికి భార్య, కుమారుడు సురేంద్ర, కుమార్తె అశ్విని ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయతీ

కదిరి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కదిరి ఆర్టీసీ డిపో డ్రైవర్ రమేష్‌నాయుడు తన నిజాయతీని చాటుకున్నాడు. శనివారం కదిరి నుంచి విజయవాడకు వెళ్లే బస్సులో నరసారావుపేటకు చెందిన జేషయ్య కదిరిలో బస్సు ఎక్కాడు. రూ. 10 వేలు ఉన్న అతని పర్సు బస్సులో పడిపోయింది. నరసారావుపేటలో దిగి.. ఇంటికె ళ్లిన తరువాత జేషయ్య తన పర్సు పోయినట్లు గుర్తించి.. ఆర్టీసీ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించాడు. ఆ అధికారులు ఫోన్ ద్వారా డ్రైవర్ రమేష్ నాయుడికి సమాచారం అందించారు. అతను బస్సులో సీటు కింద పడి ఉన్న ఆ పర్సును తీసుకొని.. జేషయ్యకు సమాచారం ఇచ్చాడు. తిరుగు ప్రయాణంలో నరసారావుపేటలో జేషయ్యకు ఆ పర్సును ఆదివారం అందజేశాడు. దీంతో అతను డ్రైవర్ రమేష్‌నాయుడికి కృతజ్ఞతలు తెలిపాడు.



జేషయ్యకు పర్సు అందజేస్తున్న డ్రైవర్ రమేష్‌నాయుడు

సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీపర్తిసాయి ధర్మశాల ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలకు అర్హులైన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకుడు చల్లా సాయికృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెళ్లి కుమారుడికి 21 సంవత్సరాలు, పెళ్ళికుమార్తెకు 18 సంవత్సరాలు నిండి ఉండాలని, ఇందుకు సంబంధించి దరఖాస్తులు ఈనెల 24 గురువారం నుంచి శ్రీసత్యసాయి ఎయిర్‌పోర్టు ఎదురుగా ఉన్న శ్రీపర్తిసాయి ధర్మశాలలో అందుబాటులో ఉంటాయని అన్నారు. ఉచిత సామూహిక వివాహాలు డిసెంబరు 15న కొత్తచెరువు మండలం చెన్నకేశవపురం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో నిర్వహిస్తామన్నారు.

ఉద్యోగాలకు 23 మంది ఎంపిక

కదిరి అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించారు. 53 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 23 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ నాగార్జున, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రిపై తప్పుడు ప్రచారాలు మానుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవితపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. సోషల్ మీడియాలో మంత్రిపై అసత్యప్రచారాలు చేస్తుండటంపై ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సవిత అనతి కాలంలోనే అంచలంచెలుగా ఎదిగి నియోజకవర్గ ప్రజల మన్ననలు పొంది ఎన్నో కార్యక్రమాలు చేస్తూ వచ్చారన్నారు. ఆమె ఎదుగుదలను ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తూ అవినీతి మరకలు అంటించాలని చూస్తున్నారన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తే గుణపాఠం చెబుతామన్నారు. అనంతరం టీడీపీ నాయకులు పెనుకొండ ఎస్ఐ వెంకటేశ్వర్లుకు అసత్య ప్రచారాలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, కేశవయ్య, సూరి, శ్రీనివాసులు, ఆంజనేయులు, శ్రీరాములు, త్రివేంద్ర, సిద్దయ్య, షౌకత్అలీ, చంద్రకాంతమ్మ, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

గోరంట్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక అరుణ బిల్డింగ్స్‌లోని రెండు దుకాణాల్లో ఆదివారం రాత్రి చోరీలు జరిగాయి. దాదాపీర్‌కు చెందిన షాన్వాజ్ ఎంటర్‌ప్రైజస్ దుకాణం పైకప్పు రేకులు తొలగించి చోరీ చేశారు. ఐదు కొత్త మోటార్లు, 50 వైరుకాయిల్స్ ఫ్యాన్లతోపాటు శానటరీ తదితర వస్తువులు చోరీ చేశారు వీటి విలువ రూ. 5లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. పక్కనే ఉన్ననవావుల్లా టీ దుకాణంలో షటర్ తాళం పగలకొట్టి అందులోని రూ.30వేల విలువ చేసే ఐదు సింగరేట్ బండిల్స్, కూల్‌డ్రింక్ బాటిళ్లు, రూ.4వేల నగదు ఎత్తుకెళ్లినట్లు యజమాని కరీముల్లా తెలిపారు. సమీపంలోని బాబురెడ్డి ఇంటి ముందు పెంచుతున్న 20 నాటీ కోళ్లను ఎత్తుకెళ్లారు. చోరీ జరిగిన దుకాణాలను సోమవారం సీఐ శేఖర్ పరిశీలించారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

గోరంట్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. గోరంట్లలో సోమవారం హమాలీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీల జీవనం దుర్భరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా హమాలీల నూతన కమిటీ అధ్యక్షుడిగా ప్రసాద్, కార్యదర్శిగా కుళ్లాయప్ప, కోశాధికారిగా నాగార్జున, ఉపాధ్యక్షులుగా గంగాధర్, శీనా, సహాయ కార్యదర్శులుగా వి. శీనప్ప, బి. శీనప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సీఐటీయూ నాయకులు బాబా, కమల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరిక

మడకశిర టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల సమక్షంలో పలువురు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. అగళి మండలం పూలపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు యోగేష్‌యాదవ్, ఈరన్న, రేవన్న, తిమ్మారెడ్డి, రాజుతోపాటు మరో ఐదు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చే రారు.

పోలీసుల తనిఖీలు

సోమందేపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. మండలంలోని వినాయకనగర్, శివనగర్, మారుతీనగర్, నక్కలగుట్ట తదితర ప్రాంతాల్లో అనుమానితుల ఇళ్లలోసోదాలు చేపట్టారు. గంజాయి విక్రేతలు సోమందేపల్లిలో విస్తృతంగా విక్రయాలు జరుపుతూ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారన్న సమాచారం అందడంతో పలువురి ఇళ్లలో ఎస్ఐలు రమేష్, వెంకటేశ్వర్లు, రాజేష్ తనిఖీలు నిర్వహించారు. కొందరు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

25న ఉచిత వైద్యశిబిరం

హిందూపురం అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వినికిడి లోపం ఉన్న వారికి రాష్ట్రీయ బాల ఆరోగ్య, దీన్‌దయాల్ జాతీయ చెవుడు నిర్మూలన నియంత్రణ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ మంజువాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హిందూపురంలోని డీఈఐసీ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్యాంపు ఉంటుందన్నారు. 19 సంవత్సరాల లోపు ఉన్న వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు ఇతర పత్రాలు తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9591459867ను సంప్రదించాలన్నారు.

తహసీల్దార్ నోటీసుకు నిరసనగా ధర్నా

పావగడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని కేటీ హళ్లి గ్రామ సర్వేనెంబరు 96 ప్రభుత్వ భూమిలో నిర్మించిన చాముండేశ్వరి ఆలయాన్ని తొలగించాలని తహసీల్దార్ ఇచ్చిన నోటీసుకు వ్యతిరేకంగా విశ్వ హిందూ పరిషత్ నాయకులు సోమవారం ధర్నా చేశారు. ఈనెల 7న తహసీల్దార్ వరదరాజు, సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లి ప్రభుత్వ భూమిలో నిర్మించుకొన్న ఇళ్లు, దేవాలయాన్ని పరిశీలించి ఈనెల 21న తొలగించాలని, లేనిపక్షంలో ప్రభుత్వమే 29న ఆ స్థలాన్ని సొంతం చేసుకొంటామని తహసీల్దార్ నోటీసు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళూరుకు చెందిన విశ్వహిందూపరిషత్ నాయకులు, బజరంగదళ్ నాయకులు ధర్నా చేశారు. అనంతరం వినతి పత్రం అందజేశారు.

వ్యవసాయ సంఘాల అభివృద్ధికి కృషి

పావగడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యాప్తంగా నెలకొన్న వ్యవసాయ సేవా సంఘాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ రాజేంద్ర తెలిపారు. సోమవారం కోటగుడ్డం గ్రామంలో నూతనంగా నిర్మించిన వీఎస్ఎస్ఎన్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తన తండ్రి హయాంలో చేపట్టిన వీఎస్ఎస్ఎన్, డీసీసీ బ్యాంకుల అభివృద్ధికి తాను కూడా భాగస్వామినై రైతుల అభివృద్ధికి అన్నివిధాలా సహాయపడతానని తెలిపారు. నిడిగల్లు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని వాల్మీకి సంజయ్‌కుమార్ స్వామిజీ ఎమ్మెల్సీకి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ నరసింహయ్య, వీఎస్ఎస్ఎన్ అధ్యక్షుడు అంజప్ప, సేవానాయక్, జంగమయ్య పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మడకశిర రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్‌ఆర్ పాళ్యం గ్రామానికి చెందిన మనోజ్ (24) అనే యువకుడు సోమవారం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సీఐ రామారావు తెలిపిన మేరకు.. హెచ్‌ఆర్ పాళ్యానికి చెందిన నాగరాజుకు ఉన్న ఒక్క కుమారుడు మనోజ్ ఐటీఐ చదువుకున్నాడు. ఎక్కడా ఉద్యోగం దొరక్క, దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యచేసుకోన్నాట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వాలు

హిందూపురం అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అన్నం పెట్టే రైతులకు రాష్ట్రం, దేశంలో దిక్కు లేకుండా పోయిందని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పరిగిరోడ్డులో అఖిల భారత రైతు వ్యవసాయ కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రైతు ప్రథమ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్నదాతలు ఎక్కువగా ఉన్నారని, వారందరూ ఇంటిల్లిపాది చమటోడ్చి కష్టం చేస్తే కానీ మన ఐదు వేళ్లు నోటిలోకి వెళ్లవన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గిరీష్, కార్యదర్శి నాగముత్యాలు పాల్గొన్నారు. సత్యసాయి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సంజీవరాయప్ప, ఉపాధ్యక్షుడిగా నాగిరెడ్డి, కార్యదర్శిగా రంగనాయకులు, కోశాధికారిగా శంకరప్ప, సభ్యులుగా నరసింహప్ప, జయరామప్ప, శంకరప్ప, నంజేగౌడ, చలపతి, కిష్టప్ప, శంకర్‌రెడ్డి, నాగరాజు, గోపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

రైల్వే రోడ్డు విస్తరణ సాగేనా..?

● అభివృద్ధికి నాయకులే అడ్డంకి ● వైసీపీతో కలిసి మీడియా సమావేశం ● డోలాయమానంలో అధికారులు

హిందూపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రోజురోజుకి పెరుగుతున్న వాహనాల రద్దీ, ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని హిందూపురం పట్టణంలో రహదారులు విస్తరించాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన మొదట్లోనే పట్టణంలో రోడ్లను విస్తరిస్తామని అప్పట్లో ఆ పార్టీ నాయకులు చెప్పారు. 2021లో మున్సిపల్ పాలకవర్గం ఏర్పడ్డాక రైల్వేరోడ్డు విస్తరణ పనులే మొదటగా చేపడతామని చైర్‌పర్సన్ మొదటి సంతకం చేశారు. నాలుగేళ్లవుతున్నా రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎలాగైనా పట్టణంలో రద్దీ, ఇరుకుగా ఉండే రోడ్లను వెడల్పు చేయాలని సంకల్పించారు. అందుకు తగ్గట్టు మున్సిపల్ కమిషనర్‌గా సంగం శ్రీనివాసును తీసుకువచ్చారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, డీఎల్ రోడ్డు, బెంగళూరు రోడ్డు, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ రహదారితో పాటు పట్టణంలో విచ్చలవిడిగా అక్రమంగా నిర్మించుకున్న భవనాలను కూల్చివేసేందుకు ఆయన వచ్చిన వారం రోజుల్లోనే కార్యాచరణ చేపట్టారు. దీంతో విస్తరణ పనులు వేగంగా జరుగుతాయని పట్టణ ప్రజలు ఆశించారు. రోడ్డు అభివృద్ధికి టీడీపీ నాయకులే అడ్డు తగులుతారని ఎవరూ ఊహించలేదు.

వైసీపీతో కలిసి మీడియా సమావేశమా..?

రైల్వే రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. భవనాల యజమానులు కొందరు కోర్టుకి వెళ్లామని, మరికొంత మంది నష్టపరిహారం అందలేని చెప్పుకుంటున్నారు. ఆదివారం వైసీపీ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో కొందరు టీడీపీ నాయకులు కూడా పాల్గొనడంతో ముఖ్యనేతలు ఖంగుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టణాన్ని అభివృద్ధి చేయలేదని, రోడ్ల విస్తరణ జరగలేదని టీడీపీ నాయకులు గగ్గోలు పెట్టారు. ఈ పరిస్థితిల్లో పనులు జరుగుతుంటే అధికారులకు వ్యతిరేకంగా నాయకులు సమావేశం నిర్వహించడంపై ఆ పార్టీ



రైల్వేరోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న దృశ్యం

ముఖ్యనేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ సమావేశంలో టీడీపికి చెందిన ముఖ్య నాయకుడు పాల్గొనడంపై చర్చించుకుంటున్నారు.

డోలాయమానంలో అధికారులు

ఒక వైపు రోడ్ల విస్తరణ పనులు ఆపకూడదని, అవసరమైతే ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేసుకొని వేగంగా జరగాలంటూ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి అధికారులకు ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. మరో వైపు అధికార పార్టీ, ప్రతిపక్ష నాయకులు కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడటంతో అధికారులు డోలాయమానంలో పడ్డారు. అసలు రైల్వేరోడ్డు విస్తరణ పనులు ఇన్నేళ్లు సాగకపోవడానికి ఇదే కారణమేమోనని అధికారులు భావిస్తున్నారు. అధికారులకు ముందు నెయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా ఉంది. మున్సిపల్ కమిషనర్ ధైర్యంగా ముందుకెళుతున్నారు. నాలుగైదు రోజుల్లో రైల్వే రోడ్డులోని భవనాలను కూల్చివేయడం పూర్తవుతుందని తెలుస్తోంది. నాయకులు ఒత్తిళ్లు, కోర్టు వ్యవహారాల నేపథ్యంలో రైల్వేరోడ్డు విస్తరణ పనులు జరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

చిలమత్తూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో వందశాతం ఉత్తీర్ణతను తీసుకురావాలని, ఆ దిశగా విద్యార్థులు కూడా శ్రద్ధగా చదువుకోవాలని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి పేర్కొన్నారు. సోమవారం ఆమె మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా హెరిటేజ్ సంస్థ ముందుకు వచ్చి మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలకు రూ. 2.5 లక్షలు విలువచేసే 5 కంప్యూటర్లు, జిరాక్స్ మిషన్, ప్రింటర్, సౌండ్ సిస్టమ్, జూనియర్ కళాశాలకు 9 కంప్యూటర్లు, జిరాక్స్ మిషన్, ప్రింటర్, టేకులోడు గురుకుల పాఠశాలకు ఫ్యాన్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా వసుందరదేవి వాటిని వారికి అందజేశారు. అనంతరం టేకులోడు గురుకుల పాఠశాలకు రూ. 50 లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. హెరిటేజ్ సంస్థ ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మౌళిక సదుపాయాల కల్పించాలని నారా బ్రాహ్మణిని ఆయన కోరారని వివరించారు. ఆమె తక్షణమే స్పందించి పాఠశాలలకు అవసరమైన సదుపాయాలను కల్పించారని తెలిపారు.



టేకులోడు గురుకుల పాఠశాలకు ఫ్యాన్లను అందజేస్తున్న వసుంధరాదేవి

విద్యార్థుల కోసం ఎమ్మెల్యే బాలకృష్ణ ఎంతైన సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో హెరిటేజ్ సంస్థ సీఈఓ ఉపేంద్ర పాండే, ఇన్‌చార్జ్ తహసీల్దార్ యునస్ బాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమణమూర్తి, జడ్పీటీసీ సభ్యురాలు అనూష, టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు తిప్పారెడ్డి, బాలాజీ, సోమశేఖర్, నందీశప్ప, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి



మడకశిరలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

పోలీసు అమరవీరులకు పలుచోట్ల ఘనంగా నివాళులు అర్పించారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మడకశిర పట్టణంలోని పోలీసు అమరవీరుల పార్కులో సోమవారం సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రాణాలను కూడా లెక్కచేయకుండా విధుల్లో అసువులు బాసిన పోలీసుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ రామారావు, రూరల్ సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పోలీసులు ప్రజా రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయరని, ప్రజల రక్షణే ధ్యేయంగా పనిస్తుంటారని, అమరులైన పోలీసుల ఆశయ సాధన కోసం కృషిచేద్దామన్నారు. అమరాపురం పోలీసు సిబ్బంది జడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామాంజనేయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గుడిబండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మునిప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత గుడిబండలో ర్యాలీ నిర్వహించారు. అగళి మండలంలోని నరసంబుది గ్రా మంలో ఎస్ఐ వీరేష్ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్: ఎమ్మెల్యే



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, వారి నుంచి వచ్చే ప్రతి వినతిపత్రాన్ని పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులకు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రజాసమస్యల పరిష్కారానికి ఓ వేదిక అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా అందరం కృషి చేద్దామని తెలిపారు. భూ సమస్యలు, విద్యుత్, రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం మొత్తం 238 వినతులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీఓ సోనీబాయితోపాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

మడకశిర రూరల్: గ్రామాల సర్వోతోముఖాభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బుళ్ల సముద్రం, ఎం.రంగాపురం, కల్లుమర్రి పంచాయతీల్లో పల్లె పండుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు గ్రామాల్లో ఎమ్మెల్యే రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు పంచాయతీల్లో రూ.70 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోనియాబాయి, ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు జైపాల్, మారుతిరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వేధింపులు ఆపకపోతే ఆందోళన చేస్తాం

అంగన్‌వాడీ కార్యకర్తల హెచ్చరిక

హిందూపురం అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తనిఖీల పేరుతో తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు అంగన్‌వాడీలను వేధించడం సరికాదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం సీడీపీఓ రెడ్డిరమణమ్మకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసీపీ హయాంలో అంగన్‌వాడీ సమస్యలపై 42 రోజులు సమ్మె చేశామన్నారు. ఆ సమయంలో టీడీపీ నాయకులు వచ్చి మీరు చేస్తున్న పనికి రూ. 50 వే లు జీతం అందించినా తక్కువే అన్నారని గుర్తు చే శారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అం గన్‌వాడీలక న్యాయం చేస్తామన్నారని, న్యాయం చే యక పోగా ఇప్పుడు కొంత మంది సెంటర్ల విజిట్ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాగే కొనసాగితే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు శోభ, లావణ్య, శైలజ, విజయలక్ష్మీ, నాగమ్మ, రాము పాల్గొన్నారు.

పెనుకొండలో భారీ వర్షం.. వీధులు జలమయం

పెనుకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా పెనుకొండలో భారీ వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమైన వర్షం 7గం టల వరకు కురిసింది. దీంతో తోటగేరి రామ మందిరం బ్రాహ్మణ వీధి, కుమ్మరదొడ్డి, తదితర లోతట్టు ప్రాం తాలన్నీ జలమయమయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. బ్రాహ్మణ వీధిలోని నివాసం లేని ఓ పురాతన ఇల్లు కుప్పకూలింది. అదే వీధిలో కాపురం ఉంటున్న వజ్రముష్టి ఆంజనేయస్వామి ఆలయ అర్చకుడు చెర్లోపల్లి గోపాలస్వామి పాత ఇల్లుకూ డా పడిపోయింది. అదృష్టవశాత్తు ఇంట్లో ఎవరికీ ప్రమాదం జరగలేదు.



వీధుల్లో ప్రవహిస్తున్న వర్షపు నీరు, కూలిన పురాతన ఇల్లు

బాధితులను ఆదుకుంటాం

పరామర్శించిన నందమూరి వసుంధరాదేవి

హిందూపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల సామూహిక అత్యాచారానికి గురైన అత్తా, కోడళ్లను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరదేవి పరామర్శించారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు ఇద్దరిని సోమవారం ఆమె పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వారికి జరిగిన అన్యాయం క్షమించరానిదని అన్నారు. నియోజకవర్గంలో భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు బాలకృష్ణ అధికారులకు సూచించినట్లు తెలిపారు. వారికి జరిగిన ఘోరాన్ని తెలుసుకునేందుకు తనను పంపారని అన్నారు. బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలా అం డగా ఉంటుందని, వారికి తోడ్పాటునందిస్తామన్నారు. బాధిత కుటుంబానికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తూ అన్నివిధాలా సహాయం అందిస్తామన్నారు.

కోరంలేక మండల సమావేశం వాయిదా

గోరంట్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : కోరం లేకపోవడంతో మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ నరేంద్ర కుమార్ ప్రకటించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు రాని కారణంగా వాయిదా వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఏర్పాటు కాగా, 3.30 గంటలైనా సభ్యులు రాకపోవడంతో మరో అరగంటపాటు సభను వాయిదా వేశారు. అయినప్పటికి రాకపోవడంతో మంగళవారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ ప్రకటించారు. మండలంలోని 22 ఎంపీటీసీ స్థానాల్లో వైసీపీ సభ్యులే ఉండగా.. ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ వర్గాల మధ్య కొనసాగుతున్న విభేదాల వల్లే మొదటిసారి మండల సమావేశం వాయిదావేయాల్సి వచ్చిందని తెలుస్తోంది.

బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం

గోరంట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మలవాండ్లపల్లి వద్ద సోమవారం బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన శాఖను తిరుపతి రీజనల్ ఏజీఎం అమరనాథ్‌రెడ్డి ప్రారంభించారు. కమ్మలవాండ్లపల్లి వద్ద గల బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీకి అనుబంధంగా నూతన బ్యాంక్ శాఖను ప్రారంభించారు. బ్యాంక్ ఏర్పాటు వల్ల 20 గ్రామాల ప్రజలకు సేవలు అందుబాటులో ఉంటాయని ఏజీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో బెస్ట్ యూనివర్సిటీ చాన్సిలర్ రూపావాసుదేవన్, ఛైర్మన్ భరత్‌లాల్‌మీనా, వైస్ చాన్సిలర్ అనురాధ, బీఓబీ హిందూపురం బ్రాంచ్ మేనేజర్ రాంబాబు, గౌతం పాల్గొన్నారు.



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఏజీఎం అమరనాథ్‌రెడ్డి





